క్లుప్తంగా

చేతిపంపు బోరు ప్రారంభం



బోరు ప్రారంభం చేస్తున్న దృశ్యం

గొలుగొండ : కొంకసింగి గ్రామ పరిధిలో ఉన్న ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. కొంకసింగి గ్రామంలో ఈ కాలనీలో తాగునీటి సమస్య కారణంగా ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని చేతిపంపు బోరును ఎంపీపీ నిధుల నుంచి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీని వల్ల తాగునీటి సమస్య లేదని తెలిపారు. ప్రధానంగా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు సత్యనారాయణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆవు పెయ్యి మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన ఆవు పెయ్యి

బుచ్చెయ్యపేట : చిన అప్పన పాలెం గ్రామంలో వీధి కుక్కల దాడిలో ఆవు పెయ్యి మృతి చెందింది. గ్రామానికి చెందిన అమరపిన్ని లక్ష్మీనారాయణ సోమవారం ఉదయం తన పాక వద్ద ఆవుపాలు తీసి దూడను కట్టి ఇంటికెళ్లిపోయాడు. మధ్యాహ్నం పాక వద్దకు వచ్చి చూడగా ఆవు పెయ్యి ఒంటిపై గాయాలతో మృతి చెంది ఉంది. దగ్గరలోనే వీధి కుక్కలు ఉండడంతో కుక్కలు ఆవు పెయ్యిపై దాడి చేసి కరిచి చంపేసినట్టు గుర్తించారు. ఇటీవల గ్రామంలో పలువురు నాటు కోళ్లతో పాటు ఆవు, గేదె పెయ్యిలను, మేకలు, గొర్రెలపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని వీధి కుక్కలను నిర్మూలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత



మాస్క్ పెట్టుకుని నమూనా ఆక్సిజన్ సిలెండర్‌తో మొక్క నాటుతున్న విద్యార్థి

మాకవరపాలెం : కాలుష్య నివారణ అందరి బాధ్యత అని మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.రాము అన్నారు. ఈ పాఠశాలలో సోమవారం కాలుష్య నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలుష్యం పెరగడానికి గల కారణాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రతి ఇంటి వద్ద విద్యార్థులు మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఢిల్లీలో కాలుష్యం కారణంగా పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని కాలుష్య నివారణే లక్ష్యంగా మొక్కలు నాటాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో మాస్క్ ధరించి, నమూనా ఆక్సిజన్ సిలిండర్‌తో మొక్కలు నాటాల్సి వస్తుందని చూపుతూ విద్యార్థి అందరికీ అవగాహన కల్పించాడు.

షష్టి మహోత్సవాలకు ఏర్పాట్లు



సుబ్రహ్మణ్య స్వామి

నర్సీపట్నం : సుబ్రహ్మణ్య షష్టి మహోత్సవాలకు మున్సిపాలిటీ శారదనగర్ బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం ముస్తాబైంది. ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకుడి పూజతో ప్రారంభమై సుబ్రహ్మణ్యస్వామి వారికి 60 లీటర్ల పాలతో క్షీరాభిషేకం కనుల పండుగగా జరగనుంది. రాహు, కేతు పూజలు అనంతరం స్వామి వారి హోమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రైతు కష్టం దళారుల భోజ్యం

- ధాన్యం తూకంలో మోసాలు
- ప్రారంభం కాని ధాన్యం సేకరణ కేంద్రాలు
- రైతు సంక్షేమం గాలికొదిలేసిన ప్రభుత్వం
- మాడుగుల నియోజకవర్గంలో సుమారు 50,900 ఎకరాల్లో వరి సాగు

నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాగు ఎకరాల్లో...

మండలం	సాగు విస్తీర్ణం
మాడుగుల	13,500
చీడికాడ	10,400
దేవరాపల్లి	14,200
కె. కోటపాడు	12,800



సత్యవరం గ్రామంలో ధాన్యం తడిచిపోవడంతో తార్పాలిన్‌తో కప్పుతున్న రైతు



కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో పొలాల్లోనే ఆరబెట్టిన ధాన్యం తడిసిన దృశ్యం

మద్దతు ధరలు ఇలా..

రకం	క్వింటా	80 కిలోలు	40 కిలోలు
గ్రేడ్‌	2320	1856	928
కామన్‌	2300	1840	920

మాడుగుల : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఒక ప్రక్క తుఫాను, మరో ప్రక్క దళారులు దోచేస్తున్నారని, నియోజకవర్గంలో గల సన్న చిన్నకారు రైతులు ఆవేదన చెందుతున్నారు. మాడుగుల నియోజకవర్గంలో ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో దళారులు రంగ ప్రవేశం చేశారు. వారికి నచ్చిన ధరలకు కొనుగోలు చేస్తున్నారు. నియోజకవర్గంలో చెరకు సాగు లేకపోవడంతో రైతులందరూ వరి సాగుపై దృష్టి సారించడంతో సుమారు 50,900 ఎకరాల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం చేలన్నీ కోత దశకు చేరుకున్నాయి. తుపాను హెచ్చరికలు రావడంతో కోసిన వరి చేలన్నీ పొలాల్లోనే కుప్పలు వేశారు. నూర్పిళ్ల పూర్తయ్యాక ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిద్దామని, పొలాల్లోనే రాశులు పోశారు. ఈ లోగా తుపానుకు ముందు ఎండబెట్టిన ధాన్యంతో పాటు, రాశులు పోసిన ధాన్యం వర్షాలకు తడిచిపోయింది. దీంతో ప్రస్తుతం ఆదుకునే నాథుడు లేక దళారులకు తక్కువ ధరకు పంట కట్టబెట్టి నష్టపోతున్నారు.

తూకంలో మోసాలు

రైతుల వద్ద తేమ శాతం అధికంగా ఉందని, కొంత రైతులకు తెలియకుండా కొంత బస్తా దగ్గర, 3 కిలోల వరకు ధాన్యం లెస్ చేస్తున్నారు. కంప్యూటర్ తూనికలు కూడా సక్రమంగా ఉండడం లేదని దీంతో రైతులు మోసపోతున్నారని ఆరోపణలు ఉన్నాయి. తూనిక కొలతలు అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఆడింది ఆట.. పాడింది పాటగా మూడు పువ్వులు ఆరుకాయలుగా ప్రస్తుతం వ్యాపారాలు సాగుతున్నాయి.



కోసిన వరి చేలు పొలాల్లోనే కుప్పలు పెట్టిన దృశ్యం

ప్రారంభం కాని ధాన్యం సేకరణ కేంద్రాలు

మాడుగుల నియోజకవర్గంలో మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె. కోటపాడు మండలాల్లో నేటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు అధికారికంగా ప్రారంభించలేదు. దీని వల్ల యంత్రాలు ద్వారా కోత, నూర్పిడి చేసిన రైతులు ధాన్యం నిల్వ చేయలేక దళారులు అడిగినంత ధరలకు కట్టబెట్టి ప్రభుత్వ మద్దతు ధరలు కోల్పోతున్నారు.

రైతులను పట్టించుకోలేదు



కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక నూర్చిన ధాన్యం పొలాల్లోనే ఉండిపోయాయి. తుపానుకు తార్పాలు కప్పినా సరే తడిసిపోతున్నాయి. కొంత మేర కోసిన వరి పనలు పొలాల్లోనే తడుస్తున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక రైతులు నష్టపోతున్నారు. దళారి వ్యవస్థ రాజ్యమేలుతుంది. ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. – నాగేశ్వరావు, రైతు, సత్యవరం

వారంరోజుల్లో ధాన్యం సేకరణ కేంద్రాలు

మరో వారం రోజుల్లో ప్రభుత్వ ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. తడిచిన ధాన్యంపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసి ధాన్యం కాపాడుకోవాలి. తూకంలో మోసాలు జరిగితే ప్రభుత్వ పరంగా చర్యలు ఉంటాయి.

–ఎం. వాసుదేవరావు, వ్యవసాయాధికారి, మాడుగుల

వాసవీ కల్యాణ మండపం ఆర్థిక వ్యవహారాలపై విచారణ జరపాలి

- ప్రజా ఫిర్యాదుల వేదికలో ఆర్డీవోకు ఫిర్యాదు



ఆర్డీవో వి.వి.రమణకు ఫిర్యాదు చేస్తున్న సంఘ సభ్యులు

నర్సీపట్నం : నర్సీపట్నం వాసవీ కళ్యాణ మండప సంఘం ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ 25వ వార్డుకు చెందిన సంఘ సభ్యుడు ఉప్పల సూర్యసన్యాసిశెట్టి సోమవారం స్పందనలో ఆర్డీవో వి.వి.రమణకు ఫిర్యాదు చేశారు. ఆర్యవైశ్య కుటుంబ సభ్యుల చందాలతో వాసవీ కళ్యాణ మండపాన్ని కొనుగోలు చేశారని, కొందరు వ్యక్తులు కళ్యాణ మండపాన్ని గుప్పెట్లో పెట్టుకొని, ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నారని ఆర్డీవోకు వివరించారు. ముప్పై ఏళ్లుగా సంఘం కార్యవర్గాన్ని మార్చలేదని, కొత్త కార్యవర్గం నియామకానికి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘం పేరిట వసూలైన రోజువారీ వచ్చే ఆదాయాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా దోచుకుంటున్నారని ఆరోపించారు. సంఘం అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి, నూతన కార్యవర్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. అలాగే ఇళ్ల మధ్యలో ఉన్న ఇటుక బట్టీల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గబ్బాడ పంచాయతీ వాసులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

మత్తు, సైబర్ నేరాల వలలో యువత



మాట్లాడుతున్న సీఐ అప్పలరాజు

చోడవరం రూరల్ : యువత మత్తు పదార్థాల వాడకానికి, సైబర్ నేరాలకు బానిసలుగా మారారని చోడవరం సీఐ అప్పలరాజు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్, మత్తు పదార్థాల వాడకం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న వారిలో యువత అధికశాతం ఉంటున్నారని, ఎలాంటి అనుమానం వచ్చినా తక్షణం పోలీస్ శాఖను సంప్రదించాల్సిందిగా సూచించారు. ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, మహిళా పోలీస్ అర్కే శిరీష, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు మాల్యాద్రి, పిచ్చమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ సారె ఊరేగింపు



వీరనారాయణంలో సారె ఉరేగింపు

మాడుగుల రూరల్ : మండలంలో వీరనారాయణం గ్రామంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ ఉత్సవాలు గత నెల 2వ తేదీన ప్రారంభించారు. గౌరీశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్టించారు. ఈ ఉత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామంలో అమ్మవారి సారె ఉరేగించారు. వివిధ 20 రకాలు పిండి వంటలు, అరటిపండ్లు, కొబ్బరికాయలను సారెలో ఉరేగించారు.

ఎస్సీ ఎస్టీ సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న తహసీల్దారు రమాదేవి

మాడుగుల రూరల్ : షెడ్యూలు కులాలు, తెగలు, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తహసీల్దారు కె.రమాదేవి పేర్కొన్నారు. కె.జె.పురం గ్రామంలో సోమవారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకుని, హౌసింగ్ కాలనీలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో అంటరానితనం పాటిస్తున్నారా అని కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో అటువంటి సమస్య లేదని వారు పేర్కొన్నారు. సర్పంచ్ జామి రమణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి వివరించారు. సమావేశంలో జిల్లా ఎస్సీ ఎస్టీ మోనిటరింగ్ సభ్యులు మరువాడ ఈశ్వరావు, పంచాయతీ జూనియర్ సహాయకులు వై. సత్యనారాయణ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాలల గర్జన జయప్రదం చేయండి



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

దేవరాపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 8న విశాఖపట్నంలో జరిగే ఉత్తరాంధ్ర మాలల గర్జన సభను జయప్రదం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ కాటపల్లి అప్పారావు పిలుపునిచ్చారు. దేవరాపల్లిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర మాలల గర్జన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అప్పారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో ఈనెల 8న మధ్యాహ్నం 2 గంటలకు ఉత్తరాంధ్ర మాలల గర్జన జరుగుతుందని, ఉత్తరాంధ్రలోని మాలలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయుకులు కార్లి సాయి సుందరరావు, మచ్చ వీర్రాజు, వేచలపు గంగాధరరావు, మచ్చ రామారావు, పరవాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి



డి.యర్రవరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న

నాతవరం : సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. డి.యర్రవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 89 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కొంతమందికి ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు పడే సమయంలో కాచి చల్లార్చిన నీళ్లు మాత్రమే తాగాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పరిశుభ్రత పాటించాలని అన్నారు. గ్రామాల్లో జ్వరాలు వ్యాపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, అక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ఇడిటెక్ ఎక్స్ ట్రయల్ అవార్డుకు ఎంపిక

కె.కోటపాడు : కె.కోటపాడులో గల అయ్యన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాల 2024 ఇటిటెక్ ఎక్స్(ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ రీసోర్సెస్ టెక్నాలజీ ఎక్స్ పో) అవార్డుకు ఎంపికైనట్టు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ తెలిపారు. విద్యారంగంలో ప్రతిభావంతమైన సృజనాత్మక పద్ధతులను అమలు చేస్తున్నందుకు పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన ఇడిటెక్ ఎక్స్ ట్రయిల్ బ్లేజర్ అవార్డుకు ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. ఈ నెల 6న హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో రతన్‌టాటా కాన్ఫరెన్స్ హల్లో విద్యా రంగంలో విశిష్ట నిపుణుల చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేయనున్నట్టు ఖాసిమ్ తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం గర్వకారణమని డైరెక్టర్ నూర్జహన్, ప్రిన్సిపాల్ సుమతి తెలిపారు.

శీతాకాలంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కె.కోటపాడు : శీతాకాలంలో కనీస ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న దృష్ట్యా వృద్ధులు, చిన్నారులు ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. గొండుపాలెం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను నిర్వహించారు. 189 మందికి వైద్యంతో పాటు 12 మంది గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపారు. గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు తెలిపారు. చిన్నారులు, వృద్ధులు ఉదయం వేళల్లో వెచ్చని దుస్తులు ధరించాలని సూచించారు. ఆస్తమా సంబంధిత రోగులు శీతాకాలంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుపుకోవాలని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్‌ఎన్.రాజు, హెచ్‌వీ అచ్చియ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్‌ఎం కుమారి పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లిలో భూ ఆక్రమణలపై చర్యలకు వినతి



ఎ. కొత్తపల్లిలో ప్రభుత్వ ఆక్రమణపై తహసీల్దార్‌కు అర్జీ అందిస్తున్న రైతులు

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో ప్రభుత్వ భూమి(చాకలి బంద) ఆక్రమణలను తొలగించాలని గ్రామానికి చెందిన కొందరు రైతులు తహసీల్దార్ పి.లక్ష్మీదేవిని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామ సర్వే నంబర్ 289లో 1.18 ఎకరం విస్తీర్ణంలో ఉన్న చాకలి బందను గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి బందను నామరూపాలు లేకుండా చేసి దర్జాగా సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. గత ఏడాది ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు సర్వే జరిపి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా తొలగించారన్నారు. తాజాగా గత నెల 19న జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేయగా మరలా రెవెన్యూ అధికార్లు సర్వే జరిపి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా రెండు రోజుల్లోనే తొలగించారన్నారు. ఇదే విషయాన్ని స్థానిక వీఆర్‌వోకు తెలియజేసినా పట్టించుకోలేదని తహసీల్దార్‌కు బాధితులు వివరించారు. ఈ బంద నీటిపై ఆధారపడి సుమారు 10 ఎకరాల భూములు, సుమారు 20 మంది రైతులు ఉన్నారని, తక్షణమే ఆక్రమణలు తొలగించి, యధావిధిగా బంద తవ్వించాలని తహసీల్దార్‌ను కంచిపాటి రమణ తదితర రైతులు ముక్త కంఠంతో కోరారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు



మ్యూజికల్ చైర్ పోటీలో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

మాకవరపాలెం : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రం దివ్యాంగులకు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులు మ్యూజికల్ చైర్, చిత్రలేఖనం, పాటలతోపాటు వివిధ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు మంగళవారం బహుమతులు అందజేస్తామని ఎంఈవో మూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, మంగలక్ష్మి పాల్గొన్నారు.

చోడవరం : రావికమతం మండలం మేడివాడ హైస్కూల్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురష్కరించుకొని సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. 48మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అంగవైకల్యం ఆటలకు అడ్డుకాదని, తాము అన్ని రంగాల్లోనూ రాణించగలమంటూ నిరూపించారు. రన్నింగ్, కుర్చీ ఆటలతోపాటు పలు ఆటలను ఆడించారు. క్రీడల్లో దివ్యాంగులు మరింతగా రాణించాలని, అందుకు అవసరమైన సహాయం అందిస్తామని ప్రత్యేక అవసరాల పాఠశాల ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథరావు చెప్పారు. విజేతలకు ఈనెల 3వతేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నాడు బహుమతులు అందజేస్తామని వారు చెప్పారు.

బెంగళూరులో గౌరీసేవా సంఘం కార్తీక సమారాధన

మాడుగుల రూరల్ : ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాల నుంచి వృత్తి, వ్యాపారాల మీద బెంగళూరులో స్థిరపడిన గౌరీయులు, బెంగళూరు పట్టణ గౌరీ సంఘం ఆధ్వర్యంలో కార్తీక సమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ సమారాధనకు 300 కుటుంబాలతో కలిసి బెంగళూరులో కాటేశ్వరమ్మ ఆలయం ప్రాంగణంలో కార్తీక వన సమారాధన నిర్వహించినట్టు బెంగళూరులో వున్న కె.జె.పురం గ్రామానికి చెందిన రాపేట గోవింద్ సోమవారం ఫోన్ ద్వారా సాక్షికి తెలిపారు. కె.జె.పురం గ్రామానికి చెందిన ఎక్కువ కుటుంబాలు వారు బెంగళూరులో సాఫ్ట్‌వేర్, ఇతర రంగాల్లో కుటుంబాలతో స్థిరపడ్డారు. ఈ సమారాధనను గ్రామానికి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ యజమాని వేగి శ్రీనివాసరావు సారథ్యంలో ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో పోలిపాడ్యమి పూజలు



చౌడువాడ శివాలయంలో దీపారాధన



కె.జె.పురం శివాలయం వద్ద




అరటి దొప్పలో వత్తులు వెలిగించి కోనేరులో వదులుతున్న మహిళా భక్తులు

కె.కోటపాడు : కార్తీకమాసం చివరిరోజైన సోమవారం నాడు పోలిపాడ్యమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో భక్తులు జరుపుకొన్నారు. కార్తీకమాసం నెలరోజుల పాటు పూజా కార్యక్రమాలను జరిపిన మహిళలు ఆయా గ్రామాల్లో గల నదులు, చెరువుల్లో అరటిజోర్లుపై కార్తీక దీపాలతో దీపారాధర కార్యక్రమాన్ని జరిపారు. కె.కోటపాడు, చౌడువాడ, ఆనందపురం, సింగన్నదొరపాలె, ఎ.కోడూరు గ్రామాల్లో గల శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలు జరిపారు.

మాడుగుల రూరల్: కార్తీక మాసం ముగియడంతో సోమవారం పోలిపాడ్యమిని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు నది స్నానాలు ఆచరించారు. గ్రామాల్లో చెంతనే వున్న నదులు, గెడ్డలల్లో అరటి జొర్లులో దీపాలు వెలిగించి శివపార్వతులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కె.జె.పురం శివాలయం వద్ద భక్తులు దీపదానం, స్వయంపాకం అందించారు. తాచేరు నదిలో దీపాలు వదిలారు.

రోలుగుంట: మండలంలో సోమవారం పోలి స్వర్గం నోమును సోమవారం వేకువ జామున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుణ్యసస్నానాలాచరించి అరటిడొప్పల్లో వత్తులు వెలిగించి నదుల్లోను, సెలయేరుల్లోను నీటిలో వదిలి పూజలు చేశారు. గ్రామానికి చెందిన శ్రీ సిద్ధివినాయక, జీవకారుణ్య సంఘాల సభ్యులు ఆదివారం రాత్రి భజన కార్యక్రమాలతో శివుని ధ్యానిస్తూ జాగారం చేశారు. నెల రోజులుగా కొనసాగిస్తున్న అఖండ జ్యోతిని ఆదివారం వేకువ జామున ఉత్తరవాహినిలో నిమజ్జనం చేశారు.

నెలలో రూ.11.16 కోట్ల మద్యం అమ్మకాలు



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ పాపు నాయుడు

చోడవరం : మద్యం దుకాణాల వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చోడవరం ఎక్సైజ్ సీఐ పాపు నాయుడు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చోడవరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 22 మద్యం దుకాణాలు ఉన్నాయని, వాటి వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని దుకాణ యజమానులకు ఆదేశించామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయని షాపుపై చర్యలు తీసుకుంటామన్నారు. నవంబరు నెలలో రూ.11.16 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని చెప్పారు. బీరు అమ్మకాలు మరింతగా పెరిగాయని, గతేడాదితో పోల్చుకుంటే మద్యం అమ్మకాలు చాలా ఎక్కువగా జరిగిందన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు, రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నామని, కేసులు కూడా నమోదు చేశామని చెప్పారు.

ఉద్యానవన పంటలకు నష్టం లేదు

మాడుగుల రూరల్ : ఫెంగల్ తుపాను ప్రభావంతో మండలంలో ఉద్యానవన పంటలకు ఎటువంటి నష్టం జరగలేదని మండల ఉద్యానవనశాఖాధికారిణి వి. భాను పుష్పలీలావతి అన్నారు. సోమవారం అమె మాడుగుల, శంకరం, గ్రామాల్లో ఉద్యానవన పంటలను పరిశీలించారు.

బుచ్చెయ్యపేట : తుపాను ప్రభావంతో పలు గ్రామాల్లో పండిన వరి పంట నేలవాలుతుంది. కోసిన వరి పనలు తడిచి పోయి ధాన్యం మొలకెత్తుతున్నాయి. దీంతో పొలాల్లో చేరిన నీటిని బైటకు పోయేలా రైతులు చేస్తున్నారు. తడిచిన వరి పనలను గట్టుకి చేర్చి ఆరబెట్టుకుంటున్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

బుచ్చెయ్యపేట : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. సోమవారం ఉదయం వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. డీఈవో పది గంటల సమయంలో వచ్చినపుడు కొంతమంది ఉపాధ్యాయులు పాఠశాలలకు రావడాన్ని గుర్తించారు. ఉపాధ్యాయులు ఉదయం 9.45 గంటలకే పాఠశాలలకు చేరుకోవాలని వారిని హెచ్చరించారు.